పేదల గో(గూ)డు పట్టదా?

- ఎన్నికల హామీని విస్మరించిన కూటమి సర్కార్
- అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్న పేదలు
- ఇళ్ల స్థలాల కోసం ఏడాదిగా అర్జీలు అందజేస్తున్నా పట్టించుకోని వైనం

కదిరి అర్బన్: పేదలకు సొంతిల్లు కలగా మారింది. అరకొర సంపాదనతో బతుకీడుస్తున్న పేదలు అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే పేదలందరికీ నాణ్యమైన ఇళ్లు నిర్మించేందుకు పట్టణ పరిధిలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. చంద్రబాబునాయుడు సారథ్యంలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అయితే హామీ అమలును పట్టించుకోలేదు. కదిరి నియోజకవర్గంలోని పేదలు ప్రజాపరిష్కార వేదికతో పాటు తహసీల్దార్, సచివాలయ అధికారులకు పలుమార్లు ఇంటి స్థలాల కోసం వ్యక్తిగత అర్జీలు అందజేశారు. అయినా ఎటువంటి స్పందనా లేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వస్తే తదుపరి సమాచారం ఇస్తామని చెప్పి పంపుతున్నారు.



సైదాపురం సర్వే నంబర్ 194లో పేదలు వేసుకున్న గుడిసెలు

పట్టా ఇవ్వండి సారూ..

కదిరి పట్టణంలోని కుమ్మరవాండ్లపల్లి హమాలీ క్వార్టర్స్ సమీపాన ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 720లో 110 మంది, సైదాపురం సర్వే నంబర్ 294లో 254 మంది నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారు. రెక్కాడితేగానీ డొక్కాడని తాము ఇంటి అద్దెలు చెల్లించలేని స్థితిలో ఇలా ప్రభుత్వ స్థలంలోకి వచ్చామని, తమకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. అలాగే వసతులు కల్పించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ఈ మేరకు ఇప్పటికే తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్‌కు అనేకమార్లు అర్జీలు అందజేశామని చెబుతున్నారు.

నాడు అర్హులకు స్థలం– ఇళ్లు

వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులైన పేదలకు స్థలాలు, పక్కాగృహాలు మంజూరు చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి లేఅవుట్లలో ప్లాట్లు కేటాయించారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులకు లబ్ధి చేకూరింది. కదిరి మున్సిపాలిటీ పరిధిలో 2,595 ఇళ్లు, కదిరి రూరల్ మండలంలో 456, గాండ్లపెంట మండలంలో 423, ఎన్పీకుంటలో 163, నల్లచెరువులో 201, తలుపులలో 282 తనకల్లులో 433 ఇళ్లు నిర్మించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఏడాది దాటిపోయినా స్థలాలు లేవు.. పక్కాగృహాలు లేవు. వీటి కోసం ఆందోళనలు చేపట్టినా.. అర్జీలు అందజేసినా ఎటువంటి ఫలితమూ లేకుండా ఉందని పేదలు పేర్కొంటున్నారు.

అర్హుల జాబితా సిద్ధం చేస్తున్నాం



కదిరి పట్టణంలోని సైదాపురం, కుమ్మరవాండ్లపల్లిలో గుడిసెలు వేసుకున్న వారి అర్జీలను పరిశీలిస్తున్నాం. రెండు వారాలుగా అర్హుల జాబితా తయారీలో సిబ్బంది నిమగ్నమై ఉన్నారు. అర్హులకు త్వరలోనే ప్రభుత్వం పట్టాలు మంజూరు చేస్తుంది.

– మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరి

అద్దెలు కట్టలేకున్నాం



కూరగాయల వ్యాపారం చేసే మాకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సొంత ఇల్లు లేదు. చిన్న ఇంటికి సైతం రూ.4వేలు అద్దె చెల్లించాల్సి వస్తోంది. అంత డబ్బు చెల్లించాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్థలం మంజూరు చేస్తే అక్కడ చిన్న ఇల్లు కట్టుకుంటాం. – అమ్ములు, కదిరి

ఇంటి స్థలం ఇవ్వండి



నేను కూలి పనులకు వెళ్తాను. మా ఆయన ఆటో డ్రైవర్. మాకు ఇద్దరు పిల్లలు సంతానం. సొంత ఇల్లు లేదు. అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల స్థలం ఇస్తామని కూటమి పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఇంతవరకు స్థలం ఊసే లేదు. ఇప్పటికైనా ఇంటి స్థలం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. – జ్యోతి, కదిరి

హామీ నిలబెట్టుకోవాలి



నేను కూలి పనులు చేసుకుని జీవిస్తున్నాను. ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి స్థలం కోసం పనులు మానుకుని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ అనేకసార్లు అర్జీలు పట్టుకుని తిరిగాం. అయినా ఫలితం లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. – భారతి, కుమ్మరవాండ్లపల్లి

పట్టా ఇవ్వొచ్చు కదా



మత్స్యకార వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్నా. నాకు ఒక కుమారుడు ఉన్నాడు. ప్రభుత్వ భూమిలో గుడిసె వేసుకున్నాం. అక్కడ పట్టాలు ఇచ్చేందుకు అభ్యంతరమేమి? వివాదస్పద భూమి అయితే ఇబ్బందులు ఉంటాయి. పట్టా కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లడం.. ధర్నాలు, నిరసనలు చేయడం పరిపాటిగా మారిపోయింది. – కాంతమ్మ, కదిరి

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ సరికాదు



పెనుకొండకు వెళ్తున్న విద్యార్థి విభాగం నాయకులతో మక్బూల్ అహ్మద్



చెన్నేకొత్తపల్లి వద్ద జాతీయ రహదారిపై అభిమానులకు అభివాదం చేస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



పుట్టపర్తి నుంచి బయల్దేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



కార్యక్రమంలో పాల్గొన్న నల్లమాడ మండల నాయకులు

కదిరి టౌన్: ప్రభుత్వ నూతన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయం సరికాదని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ అన్నారు. శుక్రవారం 'చలో పెనుకొండ మెడికల్ కాలేజీ'కి సమన్వయకర్త ఆధ్వర్యంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, బాబా వలి, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'చలో మెడికల్ కాలేజీ'కి తరలిన నాయకులు

నల్లమాడ: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ–పీపీపీ విధానాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన 'చలో మెడికల్ కాలేజీ–పెనుకొండ' కార్యక్రమానికి నల్లమాడ మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, యువజన విభాగం పుట్టపర్తి నియోజకవర్గ అధ్యక్షులు బడా నాగార్జునరెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ ఆసాది గంగిశెట్టి, మండల అధ్యక్షుడు ఆసాది శంకరప్ప, నాయకులు నాగరాజునాయుడు, రాంమోహన్‌రెడ్డి, చిన్నరాము తదితరులు పెనుకొండకు వెళ్లిన వారిలో ఉన్నారు.

పుట్టపర్తి టౌన్: 'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పుట్టపర్తి నుంచి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, మహిళలు, విద్యార్థి విభాగం, ఎస్సీ, ఎస్టీ సెల్ విభాగం తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన చలో పెనుకొండ మెడికల్ కాలేజీ కార్యక్రమానికి మండలం నుంచి నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు,కార్యకర్తలు తరలివెళ్లారు. చెన్నేకొత్తపల్లి సమీపంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

క్లుప్తంగా

రెండోరోజూ కొనసాగిన ధర్నా



ధర్నాలో పాల్గొన్న వీఆర్‌ఏలు

పుట్టపర్తి: సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామ రెవెన్యూ సహాయకులు బుక్కపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా రెండో రోజు శుక్రవారం కొనసాగింది. పే స్కేలు అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులకు పదోన్నతులు కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన చేపట్టినట్లు మండల అధ్యక్షుడు పెద్దన్న, నాయకుడు నరసింహులు తెలిపారు. ధర్నాకు సీపీఐ నాయకులు షేక్షావలి మద్దతు పలికారు.

జీతాలు వెంటనే చెల్లించాలి

ఓడీచెరువు: మండల పరిధిలోని అల్లాపల్లి, సున్నంపల్లి పంచాయతీల్లో పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులు, క్లాప్ మిత్ర, పంచాయతీ కార్మికులకు 12 నెలలుగా బకాయిపడిన జీతాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ మండల నాయకులు శుక్రవారం ఎంపీడీఓ శివప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వేతనాలందక కుటుంబాల నిర్వహణ ఇబ్బందికరంగా మారిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వీవీ రమణ, సీపీఎం మండల కన్వీనర్ కుళ్ళాయప్ప, పంచాయితీ కార్మికులు అంజినప్ప, రమణప్ప, నిర్మల, రమేష్, రాము, శ్రావణి, నాగమ్మ, సాలెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

కదిరి అర్బన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని శుక్రవారం పట్టణంలోని వేమారెడ్డి కూడలిలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చెవిలోపువ్వులు పెట్టుకుని వినూత్న నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్ ఉన్నాయన్నారు. ఎన్నికల ముందు విద్యారంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యవిద్యను ప్రైవేటీకరణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. విద్యార్థి సంఘం నాయకులను విద్యాసంస్థల్లో ప్రవేశించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించడం తగదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మహేంద్ర, గణేష్,శీనా,మహేష్, బాబు, బ్రహ్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ధర్మవరం అర్బన్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని ప్రభుత్వ వైద్యులు సురేష్‌నాయక్ తెలిపారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలోనున్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ ప్రతి మహిళా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. యుక్త వయసులో ఉన్నవారి నుంచి వయస్సు మీద పడిన మహిళలు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఏదైనా జబ్బులుంటే మందులు వాడాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు తప్పకుండా తీసుకోవాలని అప్పుడే పోషక విలువలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్



ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖరులు

ధర్మవరం: నూతనంగా ప్రవేశపెట్టిన కొన్ని విధానాలతో చాలా సమస్యలు వస్తున్నాయని దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ చేసి నిరసన తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన కొన్ని విధానాల వల్ల ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటా బేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన కార్డు ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వల్ల దస్తావేజు తయారీ అనేది జటిలమవుతూ తీవ్ర జాప్యానికి గురవుతోందన్నారు. ప్రజలు, దస్తావేజు లేఖరుల విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయన్నారు. రెండురోజులపాటు పెన్‌డౌన్‌తో నిరసన తెలుపుతున్నామని తెలిపారు.

కదిరి టౌన్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2.0 విధానంలోని లోపాలు సరిదిద్దాలని కోరుతూ దస్తావేజు లేఖరులు శుక్రవారం కదిరిలో పెన్‌డౌన్ చేశారు. పబ్లిక్ డేటా ఎంట్రీ (పీడీఈ) విధానానికి లబ్ధిదారులు, లేఖరులు వ్యతిరేకం కాదని, అందులోని సాఫ్ట్‌వేర్ లోపాలు సరిదిద్దాలని కోరారు.

శాంతిభద్రతల్లో రాజీ వద్దు

ఎన్పీకుంట: శాంతిభద్రతల విషయంలో రాజీ వద్దని కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి పోలీస్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో క్రైమ్‌రేట్‌పై ఆరా తీశారు. ప్రమాదాల నివారణ, శాంతిభద్రతల విషయంపై పలు సూచనలు చేశారు. మండలంలో అక్రమ మద్యం, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో సఖ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ వలిబాషా, మహిళా కానిస్టేబుల్ అమల, హోంగార్డు మౌలాసాహెబ్, రాజు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

బత్తలపల్లి: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తేనే తగిన గుర్తింపు వస్తుందని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో పదోన్నతిపై నల్లమాడ మండలానికి బదిలీ అయిన పరిపాలన అధికారి గంధమనేని శ్రీనివాసులును ఉద్యోగులతో పాటు రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీలకు చెందిన నేతలు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, వైస్ ఎంపీపీలు సాకే పార్వతి, గజ్జెల వెంగళరెడ్డి, జెడ్పీటీసీ సుధ తదితరులు శ్రీనివాసులు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, ప్రభాకరరెడ్డి, చిన్న ముసలప్ప, మాదిరెడ్డి పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ పెన్షన్ మంజూరు చేయండి



చంద్రశేఖర్‌రెడ్డి

కదిరి అర్బన్: ఆర్టీసీ డ్రైవర్‌గా రిటైరయ్యి నాలుగేళ్లవుతున్నా ఇంతవరకూ తనకు ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) పెన్షన్ అందలేదని కదిరికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పెన్షన్ కోసం పీఎఫ్ కార్యాలయానికి లేఖ రాస్తే కడప కార్యాలయంలో సంప్రదించాలని సూచించారని పేర్కొన్నారు. అక్కడికెళ్తే తమకు ఎలాంటి క్లెయిమ్‌లూ రాలేదని చెబుతున్నారని వాపోయారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనకు పెన్షన్ వస్తే ఆదరువుగా ఉంటుందని, అధికారులు స్పందించి మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

చెరువులకు జలకళ



మరవ పారుతున్న తవళం చెరువు

తనకల్లు: మండలంలో పలు చెరువులకు జలకళ వచ్చింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాగినేపల్లి, కురుమాలపల్లి, కదిరప్ప చెరువు, మార్పురివాండ్లపల్లి, ముసల్‌రెడ్డి కుంట, కొత్తచెరువు తదితర చెరువుల్లో నీటితో నిండిపోయి మరవ పారుతున్నాయి. శుక్రవారం చీకటిమానిపల్లి వద్ద ఈదలవంకలో భారీ నీటి ప్రవాహం కారణంగా పక్కనే ఉన్న జాతీయ రహదారి–42పై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే రాగినేపల్లి, మార్పురివాండ్లపల్లి, కురవాండ్లపల్లి, చిన్న ఎద్దులవాండ్లపల్లి తదితర గ్రామాల రోడ్లు వర్షాలతో కోతకు గురయ్యాయని ప్రజలు తెలిపారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను అధికారులు మరమ్మతు చేయాలని వారు కోరారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మవరం రూరల్: మార్కెట్ యార్డ్ వద్ద వున్న సబ్‌స్టేషన్‌లో శనివారం 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా గొట్లూరు, నాగలూరు, మల్లేనిపల్లి, తుమ్మల, తిప్పేపల్లి, శివానగర్, శాంతినగర్, కేశవనగర్‌లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జానకిరామయ్య తెలిపారు.

పోలీస్ సేవలపై అవగాహన

కొత్తచెరువు: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల, సమస్యాత్మక గ్రామం బండ్లపల్లిలో సీఐ మారుతీప్రసాద్ పోలీసు సేవలపై అవగాహన కల్పించారు. డయల్ 100, 112 తదితర పోలీసు సేవల గురించి తెలియజేశారు.

బుడ్డారెడ్డిపల్లిలో స్వస్థ్ నారీ.. స్వశక్తి పరివార్

ధర్మవరం రూరల్: బుడ్డారెడ్డిపల్లిలో డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ.. స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యమైన మహిళలు.. బలమైన కుటుంబం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబ శివమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ధర్మవరం: బుక్కపట్నం డైట్ కళాశాలలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో ధర్మవరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు సుమన, సంగీత ఉపాధ్యాయులు రమణవాణి తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులను అభినందించారు. రాష్ట్రస్థాయి గాత్ర విభాగంలో విద్యార్థినులు ఆర్.హరిణి, టి.మనోజ్ఞ, ఎస్.మెహతాజ్ ఎంపికయ్యారని తెలిపారు.

రెండోరోజూ నిరసన

చెన్నేకొత్తపల్లి: వీఆర్‌ఏల నిరసన రెండోరోజు శుక్రవారం కొనసాగింది. మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో పని చేస్తున్న వీఆర్‌ఏలు తరలివచ్చి తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి, నిరసన తెలిపారు. వీరికి సీపీఐ నాయకుడు ముత్యాలప్ప మద్దతు తెలిపారు. వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలంటు వీఆర్‌ఏలు ముదిగుబ్బలో చేపట్టిన దీక్ష రెండవ రోజు శుక్రవారం కూడా కొనసాగింది. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ నాయకులు బండ్ల వెంకటేష్, బాబ్‌జాన్, వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు ఓబుళపతి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

ముదిగుబ్బ: మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శివరాముడు హెచ్చరించారు. శుక్రవారం సచివాలయ మహిళా పోలీసులతో ఆయన సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో నేరాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలను వేధిస్తున్న ఆకతాయిలను గుర్తించాలన్నారు.

కచ్చితమైన సమాచారం ఇవ్వండి

ఓడీచెరువు : సచివాలయాల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై కచ్చితమైన సమాచారం ఇవ్వాలని మహిళా పోలీసులను ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆదేశించారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసులతో ఆయనసమావేశం నిర్వహించారు.

శాంతిభద్రతలపై దృష్టి సారించండి

ధర్మవరం రూరల్: గ్రామాల్లో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు మహిళా పోలీసులకు సూచించారు. శుక్రవాసం రూరల్ పోలీస్ స్టేషన్‌లో మండలంలోని మహిళా పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతు మహిళలపై జరిగే నేరాల విషయంలో ముందస్తుగా సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. డీఆర్పీ రమేష్‌యాదవ్ హెచ్ఐవీ/ ఎయిడ్స్ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

వరద పెరుగుతోంది.. అప్రమత్తంగా ఉండండి



పుట్టపర్తి వద్ద ప్రవహిస్తున్న చిత్రావతి నది

పుట్టపర్తి టౌన్: కర్ణాటకలో కురిసిన వర్షాలకు పుట్టపర్తిలోని చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. బాగేపల్లి వద్ద పరగోడు ప్రాజెక్టు పొంగిపొర్లుతుండటంతో వరద నీరు చిత్రావతికి అధికంగా వస్తోందని.. పరివాహక ప్రాంతాలైన ఎనుములపల్లి, రాయలవారిపల్లి, కోవెలగుట్టపల్లి, పుట్టపర్తి పరసర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ సూచించారు. పిల్లలు, వృద్ధులు ఎవ్వరూ చిత్రావతి ప్రాంతంలోకి రాకూడదని హెచ్చరించారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం నియామకం

కనగానపల్లి: ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం నియమించినట్లు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్ తెలిపారు. మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ రఫీని ఎన్నుకున్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగదు

కదిరి అర్బన్: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పట్ల ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని కదిరి మండల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఖండించారు. ఈ మేరకు డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఎంపీడీఓ పోలప్పకు శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు.

భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

పుట్టపర్తి టౌన్: భవన నిర్మాణాలకు పురపాలక సంఘం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కమిషనర్ క్రాంతికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

ధర్మవరం అర్బన్: టెక్నాలజీ అభివృద్ధి చెందే కొద్దీ ఆర్థిక మోసాలు, సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు వాటిపై అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ రెడ్డప్ప సూచించారు. పట్టణంలోని ఇందిరమ్మకాలనీ, కేతిరెడ్డికాలనీ, వైఎస్సార్ కాలనీ ప్రజలతో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు.

అర్హులకు ప్రమోషన్ చానల్ కల్పించాలి

ధర్మవరం రూరల్: ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్‌తో పాటు అర్హులైన వారికి ప్రమోషన్ చానల్ కల్పించాలని సచివాలయ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ధర్మవరం డివిజన్ అభివృద్ధి అధికారి జనార్దన్‌రావును సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.

సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం

బత్తలపల్లి: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన జరిగిన సమావేశానికి నలుగురు సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. అజెండా ప్రకారం అధికారులను పిలిచి ఆయా శాఖల ప్రగతిని వివరించాలని ఎంపీడీఓ నరసింహనాయుడు, పరిపాలన అధికారి శ్రీనివాసులు పిలిచినా సగానికి పైగా అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడం గమనార్హం. ముఖ్యంగా తహసీల్దార్, వైద్యాధికారి గైర్హాజరయ్యారు. ఒక్క దంపెట్ల సర్పంచ్ చల్లా కరుణాకర్‌నాయుడు మాత్రం తమ పంచాయతీలోని పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధ, వైస్ ఎంపీపీలు సాకే పార్వతి, గజ్జల వెంగళరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు సరిహద్దుల ఏర్పాటు

కొత్తచెరువు: మామిళ్లకుంట క్రాస్‌లో శ్మశానవాటికకు రెవెన్యూ అధికారులు సరిహద్దులు ఏర్పాటు చేశారు. ఎన్నో పోరాటాలు చేసిన తర్వాత అధికారులు స్పందించి సరిహద్దులు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించండి

ఓడీచెరువు (అమడగూరు) : తమ సమస్యలను పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అమడగూరు ఎంపీడీఓ మునెప్పకు వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక సభ్యులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులను మాతృశాఖకు అప్పగించాలన్నారు. ఇంటింటికీ తిరిగి చేపట్టే సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు.